





కాళీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

అల్లూరు: పార్వతిగా కన్యకా పరమేశ్వరి



నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తుల లలితా సహస్రనామ పారాయణ

కాళీమాతకు జై...!

జిల్లావ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఆదివారానికి ఏడవ రోజుకి చేరాయి. నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరీ ఆలయంలోని అమ్మవారు కాళీకాదేవిగా దర్శనమిచ్చారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ధనలక్ష్మిగా, నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే జొన్నవాడ కామాక్షితాయి, కావలి కలుగోళమ్మ, పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులను కటాక్షించారు. నగరంలోని ఇరుగాళమ్మ ఆలయంలో జరిగిన కుంకుమ పూజలో వేలాదిమంది మహిళలు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితా సహస్రనామార్చన జరగ్గా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం నాటి పూజల్లో పాల్గొన్న భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

– నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అందనంటున్న ఆసరా!

- 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం బాధితులకు కరువైన ప్రోత్సాహం
- శస్త్రచికిత్సల తర్వాత మందులు, ఖర్చులకు నగదు
- 11 నెలలుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- జిల్లాలో రూ.10 కోట్లకుపైగా బకాయిలు



నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ వైద్యసేవలు పొందుతున్న వారికి నగదు ప్రోత్సాహం అందనంటోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు డిశ్చార్జ్ అయి న 24 గంటల్లో నగదు వారి బ్యాంకు ఖాతాలో జమవుతుంది. అలాంటిది గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటిదాకా ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలేదు. ఆరోగ్యశ్రీ కింద ఆసరా పథకాన్ని 2019, డిసెంబరు ఒకటో తేదీన అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. విశ్రాంతి సమయంలో వైద్య చికిత్స, మందులతోపాటు ఇతర ఆదాయ వనరుల కింద నెలకు సరాసరి రూ.5వేల వరకు ఆర్థికసాయం అందేది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్టీఆర్ వైద్యసేవ పథకంగా పేరు మార్పు చేశారు. అయితే, గత వైసీపీ హయాంలో పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు ఇప్పటికి పూర్తిస్థాయిలో అందలేదు. జిల్లాలో రూ.100 కోట్ల బకాయిలు పేరుకున్న స్థితిలో ఆరోగ్యశ్రీ ఆసరా కింద ఆర్థిక ప్రోత్సాహం కూడా అందక పోవటం పట్ల వ్యాధిగ్రస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఆసరా కింద చెల్లిస్తున్న మొత్తం

సంవత్సరం	రోగులు	రూ.కోట్లలో
2021-22	33,863	16.94
2022-23	37,286	18.55
2023-24	39,888	20.39
2024-25	21,849	17.31
2025-26 (ఆగస్టు వరకు)	18,500	9.00

● రూ.కోట్లలో బకాయిలు

ప్రతి ఏటా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు 24 వేలకుపైగా జరుగుతుంటాయి. కాళ్లు, చేతులు విరిగిన వారు 3 నెలలపాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారికి నెలకు రూ.5వేలు చొప్పున 15వేలు ఆసరా పథకం ద్వారా అందిస్తున్నారు. అలాగే క్యాన్సర్ రోగులకు మెడికల్ మేనేజ్‌మెంట్ కింద 180 రోజులకు రూ.30 వేల వరకు చెల్లిస్తున్నారు. క్రిటికల్ చర్మ వ్యాధులకు సంబంధించి ఏడాదికి రూ.60వేలు ప్రభుత్వం అందించేది. అయితే, గతేడాది అక్టోబరు నుంచి ఆసరా పథకం కింద రోగులకు రూ.10 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. నిధులు విడుదల చేయక పోవటంతో రోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 132 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా ఇందులో 35 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు, 31 డెంటల్ ఆసుపత్రులు, 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆసుపత్రులు, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఇందులో ఆరోగ్యశ్రీ కింద జరుగుతున్న రోగులకు ఆసరా అందని ద్రాక్షలా మారుతోంది. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని రోగులు కోరుతున్నారు.

నిధులు విడుదల కాలేదు!

ఆసరా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయలేదు. నిధులు విడుదల అయ్యాక వారి బ్యాంకు అకౌంట్లలో నగదు జమచేస్తాం. ఇప్పటి వరకు 11 నెలల్లో రావాల్సిన బకాయిలు రోగులకు అందించాల్సి ఉంది. రోగుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం త్వరలోనే నిధులు విడుదల చేస్తుంది.



– డాక్టర్ సుధీర్‌కుమార్,
ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్

నేటి నుంచి రెండో విడత బీఈడీ కౌన్సెలింగ్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందేందుకు ఈనెల 29 (నేటి) నుంచి రెండోవిడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీ. లక్ష్మీప్రసన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3 వరకు రెండోవిడత వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్, ఈనెల 30 నుంచి అక్టోబరు 4 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, అక్టోబరు 5 నుంచి 7 వరకు వెబ్‌ఆప్షన్ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 8న వెబ్ ఆప్షన్ మార్పు చేసుకునే అవకాశం కల్పించి, 10న సీట్లు ఖరారు చేస్తామని తెలిపారు. సీట్లు ఖరారైన విద్యార్థులు 13న సెల్ఫ్ జాయినింగ్ రిపోర్ట్ ద్వారా కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు. తొలివిడతలో 64 మందికి ప్రవేశం లభించిందని, రెండో విడతలో మరో 36 మందికి అవకాశం కల్పిస్తున్నామని ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు ఎడ్‌సెట్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

వాహనమిత్ర

జాబితా తుది దశకు..

- కొనసాగుతున్న గ్రీవెన్స్‌ల పరిశీలన
- 4న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు లబ్ధి చేకూర్చేలా అమలులోకి తీసుకువచ్చిన వాహన మిత్ర పథకం లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగిసినా, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి సచివాలయాల ద్వారా వస్తున్న గ్రీవెన్స్‌లను రవాణాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. వారిలో అర్హులైన వారిని జాబితాలో చేరుస్తున్నారు. ఇప్పటివరకు 19,530 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. కాగా అక్టోబరు 4న లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.15 వేల నగదు జమ చేయనున్నది.

ధాన్యం దాచి దోపిడీ

- రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు
- భారీగా నిల్వ చేస్తున్న దళారులు
- అదును చూసి అధిక ధరలకు విక్రయం

అక్కరుకురాని కొనుగోలు కేంద్రాలు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడగారులో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. అన్నదాతల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు భారీగా నిల్వ చేస్తూ, అదును చూసి అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. వరికోతల సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్కరకు రావడం లేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా దళారులు దాచిన ధాన్యమే దర్శనమిస్తున్నది.

● తక్కువ ధరకు కొనుగోళ్లు

సుమారు 120 రోజుల కాలపరిమితిలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనల మేరకు పుట్టి రూ. 19,720లకు తగ్గకుండా కొనుగోలు చేయాలి. కానీ గ్రామాల్లో దళారులు పుట్టి రూ. 1500 నుంచి 15,500లకు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం దాచుకునేందుకు వీలు లేక, ప్రభుత్వానికి అమ్ముకునేందుకు కేంద్రాలు లేక రైతులు దళారులకు తెగనమ్ముకుంటున్నారు. ఇలా సేకరించిన ధాన్యాన్ని వారు భారీగా నిల్వ చేస్తున్నారు. గోదాములు అవకాశం ఉన్న వారు అక్కడకి, ఏ అవకాశం లేనివారు ఖాళీ స్థలాల్లో నట్టు వేసి పట్టలు కప్పేస్తున్నారు. ఇలా గ్రామాల్లో భారీగా ధాన్యం నిల్వలు దర్శనమిస్తున్నాయి. కాగా అదును చూసి ధాన్యం ధరలు పెరిగినప్పుడు దళారులు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు.

● అక్కరుకు రాని కొనుగోలు కేంద్రాలు

వరి కోతలు ప్రారంభం సమయంలోనే అధికారులు గ్రామాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కానీ ఎడగారులో ఈ కేంద్రాలను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. సోమ, మంగళవారాల్లో (నేడో, రేపో) ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్తున్నారు. గత నెల రోజులుగా వరి కోతకు వచ్చి, ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నెల్లూరురూరల్లోని తూర్పు, పడమర పల్లెలో దాదాపుగా 80 శాతం వరికోతలు పూర్తయ్యాయి. చివర ఆయకట్టు 20శాతం మాత్రమే మిగిలి ఉంది. ధాన్యం అమ్మకపు సమయంలో అక్కరుకు రాని కొనుగోలు కేంద్రాలు సీజన్ పూర్తయ్యాక ఇప్పుడెందుకు...? అంటూ రైతులు అధికారులపై గుర్రుమంటున్నారు.

చివరి వినియోగదారుడి వరకు

జీఎస్టీ ఫలాలు అందాలి

● ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు 1915 ● 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 ఫలాలు చివరి వినియోగదారుడికి వరకు అందించడం మనందరి బాధ్యతని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఆదివారం నగరంలోని లలితా కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరు చార్టెడ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ బార్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0..సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులు, ఆడిటర్లు, అధికారులు, ట్రేడ్ యూనియన్ల నాయకులు అంతా కలిసి సమన్వయంతో జీఎస్టీ ఫలాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. గతంలో నాలుగు రకాలుగా ఉన్న పన్ను విధానాన్ని, ప్రస్తుతం రెండు రకాలకే పరిమితం చేశారని చెప్పారు. దీంతో 90 శాతం మంది ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని, అన్నీ వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. వస్తు సేవలకు సంబంధించి క్రయ,విక్రయాలపై వినియోగదారుల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు 1915కి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లు, వాణిజ్య పన్నులశాఖ అధికారులతో కలిసి సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కరపత్రాలను దినకర్ ఆవిష్కరించారు.



నగరంలోని డీ మార్టులో జీఎస్టీ తగ్గిందా..లేదా అని వినియోగదారుని అడిగి తెలుసుకుంటున్న లంకా దినకర్

● అమలు తీరు పరిశీలన

నగరంలోని డీమార్టు, హీరో హోండా, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లను దినకర్ తనిఖీ చేశారు. జీఎస్టీ తగ్గింది కదా.. ? తగ్గిన ధరకే వస్తువులు ఇస్తున్నారా...? ఏం సార్ బైక్‌ల ధరలు తగ్గాయి కదా....? తగ్గిన ధరలకే ఇస్తున్నారా...? ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీ లేదు. ఈ సమాచారం మీకు తెలుసా..? అని వినియోగదారులను ఆయన అడిగారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్, బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు 11,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి ఆదివారం 11,560 క్యూసెక్కులు వస్తుండగా, 72.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 150, కండలేరుకు వరద కాలువ ద్వారా 9000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ఎకరాకు 3 బస్తాలే !

● యూరియా పంపిణీకి ప్రణాళిక ● ప్రతీ రైతుకు ప్రత్యేక కార్డు ● అమ్మినవారి ముద్ర, సంతకం తప్పనిసరి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతను అధిగమించేందుకు కలెక్టర్ హిమాన్స్ శుక్లా ఆదేశానుసారం వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. జిల్లాలో అధిక శాతం రైతులు వరి సాగుకే ప్రాధాన్యమిస్తారు. ఎకరా వరిసాగుకు సుమారుగా 135 కేజీల యూరియాను మాత్రమే వ్యవసాయశాఖ సిఫార్సు చేస్తుంది. ఈలెక్కన 45 కేజీల బస్తా లు మూడు మాత్రమే అవసరం. అయితే రైతులు మాత్రం సరాసరి ఐదు బస్తా లు వినియోగిస్తున్నారు. అంతకుమిం చి వినియోగించే రైతులు కూడా ఉన్నా రు. దీంతో వ్యవసాయ శాఖ అంచనాలు తప్పుతున్నాయి. యూరియా కోసం రైతు లు సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు. రైతుల అవసరాన్ని గుర్తిస్తున్న డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారు.



● ప్రతి రైతుకు ప్రత్యేక కార్డు

రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని డీలర్లు అధిక ధరలకు యూరియా అమ్ముకోవడం, యూరియాతోపాటు అనవసరమైన పురుగు మందులు, ఇతర ఎరువులు కూడా అంటగడుతున్నారు. అంతేకాక ఈ-పాస్‌లో వేలిముద్రలు తీసుకోకుండానే విక్రయాలు జరుపుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఈవిషయాలను అధికారులు గుర్తించారు. వీటిని అరికట్టేందుకు ప్రతి రైతుకు ప్రత్యేక కార్డు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ-క్రాప్ నమోదు చేయించుకునే ప్రతి రైతుకు ప్రత్యేక కార్డు ఇవ్వనున్నారు. యూరియా అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, 1బీ అడంగల్ ఇలా అవసరమైన పత్రాలతోపాటు ప్రత్యేకకార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, డీలర్లు ఎవరి వద్ద కొనుగోలు చేసినా ఆయా దుకాణాల ముద్ర, సంతకం, ఎన్ని బస్తాలు తీసుకొన్నది, తేదీ తప్పని సరిగా నమోదు చేయాల్సి ఉంది. దీంతో యూరియా కొరతను అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



రైతులకు ఇవ్వనున్న ప్రత్యేక కార్డు

● మూడు విడతలుగా పంపిణీ

వ్యవసాయశాఖ సిఫార్సు చేసిన మేరకు రైతులకు మూడు విడతలుగా యూరియాను అందించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. యూరియా అవసరమైన సమయంలో 10 రోజుల వ్యవధిలో మూడు విడతలుగా అంటే ఎకరాకి మూడు బస్తాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అయితే చిన్న, సన్నకారు రైతులకు మాత్రం ఒకే విడతలో అందించే అవకాశం కూడా ఉంది.

ఈ-క్రాప్ నమోదు ఆధారంగానే..

జిల్లా అవసరాలకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతున్నా... ఎక్కడో ఒక చోట సమస్య ఉంటోంది. సిఫార్సు చేసిన దాని కంటే అధికంగా యూరియాను వాడకం కూడా సమస్యకు కారణమవుతోంది. దీన్ని అధిగమించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాం. ఈ-క్రాప్ నమోదు ఆధారంగా ప్రతి రైతుకు ప్రత్యేక కార్డును ఇవ్వనున్నాం. ఈకార్డు ఉన్న రైతుకు మాత్రమే యూరియా పంపిణీ జరుగుతుంది. ఎకరాకు మూడు బ్యాగులు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించాం. ఒకే సారి కాకుం డా మూడు విడతలుగా ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.



– పీ.సత్యవాణి,
జిల్లా వ్యవసాయాధికారి

కరుణించవే కల్పవల్లి..!

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఏడో రోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు జరిగాయి. సాయంత్రం ప్రాకారోత్సవాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారు కాళికా దేవిగా భక్తులను కటాక్షించారు. ఇరుకళల పరమేశ్వరి దుర్గగా, కన్యకాపరమేశ్వరి ధనలక్ష్మిగా, భువనే శ్వరీ దేవి చండీ అవతారంలో భక్తుల పూలందుకున్నారు. ఇక, జొన్నవాడ కామాక్షితాయి మహాలక్ష్మిగా, పెంచలకోన ఆదిలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మిగా, వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి విద్యాలక్ష్మిగా, కావలి కలుగోళ శాంభవి రాజరాజేశ్వరిగా కనువిందు చేశారు. పలుచోట్ల మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించి, పూజల్లో పాల్గొన్నారు. నెల్లూరులోని రాజ రాజేశ్వరి అమ్మవారికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజితమ్మ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.



బుచ్చి : మహాలక్ష్మి అలంకరణలో కామాక్షితాయి



నెల్లూరు రూరల్ : వేదగిరిలో విద్యాలక్ష్మిగా ఆదిలక్ష్మి



కావలి రూరల్ : రాజరాజేశ్వరి అలంకరణలో కలుగోళశాంభవి



రాపూరు : విజయలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు



నెల్లూరు : ధనలక్ష్మి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి



నెల్లూరు : దుర్గాదేవి అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి

షార్ట్ సర్క్యూట్‌తో లారీలో మంటలు

● రూ. 10 లక్షల ఆస్తి నష్టమన్న బాధితులు

కావలి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కావలి మండలం మద్దూరుపాడు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఐషర్ లారీలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హర్యాణా రాష్ట్రం ఇసార్ జిల్లా నుండి తమిళనాడుకు ఇంటి పరికరాలతో వెళుతున్న లారీలో మంటలు చెలరేగాయి. వాహనంలో కొంత భాగం, అందులోని సామగ్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ స్థితి ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నెంబరు 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని, అర్జీల పర్యవేక్షణ ఏర్పాట్లు కూడా చేశామని ఆయన తెలిపారు.

7న చలో విజయవాడ : ఫాప్టో

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 7వతేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఫాప్టో నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఏకీకృత సర్వీస్ నిబంధనల సాధన కోసం, అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. ఫాప్టో రాష్ట్ర నాయకులు ఎస్ చిరంజీవి, చిట్టేటి రమేష్, జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు, కోచైర్మన్లు మురళీకృష్ణ, మాసప్రసాద్, భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న ఫాప్టో నాయకులు

బిందు సేద్యం.. తగ్గింది భారం!

● 12 శాతం నుంచి 5 శాతానికి...

జీఎస్టీ సవరణతో ఎకరాకు రూ.3 వేల వరకు ఆదా

ఉదయగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సవరణతో ఆ ఫలాలు సామాన్యులకే కాకుండా, రైతులకు కూడా నేరుగా అందుతున్నాయి. పంటల సాగులో మెట్ట ప్రాంత రైతాంగానికి ఆధారమైన బిందు, తుంపర్ల సేద్య పరికరాలపై రైతులు చెల్లించే రాయితీయేతర ధర తగ్గింది. ఈ మేరకు ఈనెల 22 నుంచే ఈ తగ్గింపు వర్తిస్తున్నది.

● 6 వేల హెక్టార్లలో లక్ష్యం

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 6 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 706.64 హెక్టార్లలో రైతులకు ఆయా పరికరాలు పంపిణీ చేసేందుకు కలెక్టర్ అనుమతులు పొందాయి. ప్రస్తుతం జీఎస్టీ కుదించడంతో ఇక నుంచి మంజూరయ్యే వాటికి వర్తిస్తుంది. దీంతో అధికశాతం మంది రైతులు తమ పంటలకు బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు.

జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి బిందు, తుంపర సేద్యం పరికరాలను 12 శాతం జీఎస్టీ అమల్లో ఉంది. రైతుకు ఇచ్చిన మొత్తం అంచనా ధరపై 12 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చే 90 శాతం రాయితీ పోను రాయితీయేతర కింద ఒక్కో ఎకరాకు రూ.9 వేల వరకు రైతులు డీడీల రరూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. ప్రస్తుతం 5 శాతానికి జీఎస్టీ తగ్గించింది. అందులో కూడా 2.5 శాతాన్ని ప్రభుత్వం చెల్లిస్తుతండగా రైతు చెల్లించాల్సి 2.5 శాతమే. దీంతో ఎకరాకు సుమారు రూ.3 వేల వరకు రైతు వాటా తగ్గింది. ఐదెకరాలున్న రైతు గతంలో దాదాపు 45 వేలు చెల్లింస్తుండగా, ప్రస్తుతం రూ.30 వేలు చెల్లిస్తున్నారు.



పొలంలో ఏర్పాటు చేసిన బిందు సేద్య పరికరం

రైతులకు ఎంతో మేలు

జీఎస్టీ తగ్గించడంతో కరువు ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి 6 వేల హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటికే 706.64 హెక్టార్లలో రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇక నుంచి దరఖాస్తు చేసుకునే రైతులకు జీఎస్టీ తగ్గుతోంది.

- సత్యనారాయణ, ఏపీఎంఐపీ పీడీ

ఆటో బోల్తా : ప్రయాణికుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని సారాయంగడి సెంటర్ వద్ద ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. బారాషహీద్ దర్గావద్దకు వెళ్లేందుకు గుర్తుతెలియని వృద్ధుడు(70) పొదలకూరురోడ్డు పద్మావతి సెంటర్ వద్ద ఆటో ఎక్కాడు. సారాయంగడి సెంటర్ వద్దకు వచ్చేసరికి మితిమీరిన వేగంతో ఓ కారు వెనుక నుంచి ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలోని వృద్ధుడు తలకు తీవ్రగాయం కాగా, ఆటోడ్రైవర్ పెంచలయ్య, మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో వృద్ధుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడు బారాషహీద్ దర్గా వద్ద ఉండే మొహిద్దీన్‌గా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

రామాలయంలో చోరీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి గ్రామ రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆలయం గేటు తాళాలు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి అమ్మవారికి దాతలు అందించిన ఐదు తాళిబొట్లను చోరీచేశారు. అలా గే హుండీని కూడా పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించి సమీపంలోని పొలాల్లో హుండీని పడేశారు. ఆదివారం ఉదయం స్థానికులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సుమారు రూ.2 లక్షల విలువ గల నగలు, నగదు చోరీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

గుండె వ్యాధులు తస్మాత్ జాగ్రత్త

● యువకులకు సైతం గుండెపోటు...

● తాజాగా కేసుల సంఖ్య పెరుగుదల

● జిల్లాలో 2.50 లక్షలమంది హృదయ రోగులు

● నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

● కొడవలూరు మండలానికి చెందిన నక్కబోతుల సురేంద్ర (23) గత ఏడాది ఫిబ్రవరిలో గుండెపోటుతో మృతిచెందారు.ఆ యువకుడికి గుండెపోటు వచ్చిన వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే ఆ యువకుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

● వెంకటాచలం మండలం చెముడుగుంటకు చెందిన సుధాకర్ (20) గత జూన్‌లో మృతిచెందాడు. గుండె పోటు వచ్చిన వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిగా, వారంపాటు చికిత్స పొంది మృతిచెందాడు. అయితే చికిత్స సమయంలో మరోసారి గుండెపోటు రావటంతో ఫలితం లేక పోయిందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇలా ఎంతోమంది యువకులు గుండెపోటుకు గురికావటం జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తుంది. ఇందుకు కారణం యువకులకు సరైన వ్యాయామం లేకపోవటం, ధూమపానం, మత్తుకు బానిసలుగా మారటమే. అర్ధరాత్రి సడన్‌గా గుండెపోటు రావటంతో నిద్రలోనే ప్రాణాలు పోతున్నాయి. గత ఆరేళ్లలో గుండెజబ్బుల నమోదు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో 60ఏళ్ల పైబడినవారిలో వచ్చే గుండెపోటు ప్రస్తుతం 17 ఏళ్ల వయసు వారికి వస్తున్నది. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సెప్టెంబరు 29న (నేడు) ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది. గుండెపోటుపై అవగాహన కల్పించి, ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరింది.

● **ఆధునిక వైద్య విధానాలు**

ప్రస్తుతం గుండెకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని నారాయణ, కిమ్స్, అపోలో, మెడికవర్, ఎయిమ్స్ ఆసుపత్రులలో అత్యంత ఆధునాతనమైన క్యాథ్‌ల్యాప్ పరికరం ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. సిటీయాంజీయో, టీఎంటీ వంటి పరికరాల ద్వారా గుండెజబ్బు ఏస్థాయిలో ఉందే గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. తాజాగా గుండె రక్తనాళాలకు వేసే స్టంట్‌లు కూడా కరిగి పోయే ఆధునిక చికిత్సలు అందుబాటులోకి రావటం శుభపరిణామం.

● **లక్షలమంది వ్యాధిగ్రస్థులు**

జిల్లాలో ప్రస్తుతం 2.50 లక్షలమంది గుండె వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతినెలా 500మందికిపైగా వ్యాధిగ్రస్థులు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. గుండెవ్యాధి బాధితులకు ప్రతి నెలా 150కిపైగా ప్రైమరీ యాంజియోప్లాస్టీ (స్టంట్స్) శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గుండెవ్యాధుల తీవ్రత కారణంగా గుండెకు బైపాస్ శస్త్రచికిత్సలు ప్రతినెలా జిల్లాలో 35 నుంచి 50 వరకు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

● **ఏటా ఏడువేల మంది మృత్యువాత**

జిల్లావ్యాప్తంగా ప్రతిఏటా ఏడువేల మంది గుండె వ్యాధులతో మృత్యువాత పడుతున్నారు. ఇందులో 40 ఏళ్ల లోపు బాధితులే ఎక్కువమంది ఉన్నారు. వీరిలో 25 ఏళ్ల లోపు వారు ఉన్నారంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో తెలుస్తుంది. ఏటా గుండెవ్యాధుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ధూమపానం వల్ల 56 శాతం గుండెజబ్బులు వస్తుండగా, గుండెపోటు వల్ల 25 శాతం, ఊబకాయంవల్ల ఐదు శాతం గుండెజబ్బుల గురవుతున్నారు. దారితీస్తోంది. ఆరోగ్యకరమైన వ్యక్తి కూడా ఏడాదికి ఒకసారి గుండె పరీక్షలు చేయించుకుంటే 80 శాతం గుండె జబ్బులను అధిగమించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గుండెపై తీవ్ర ప్రభావం

చిన్నారులపై గుండెపోటు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గతంలో 60 ఏళ్ల పైబడిన వారికి వచ్చే గుండె వ్యాధులు ప్రస్తుతం 5 నుంచి 17 ఏళ్ల వారిపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఆహారపు అలవాట్లు, జీవన విధానాల వల్ల గుండె వ్యాధులు పెరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి కారణంగా కూడా అనేక మంది గుండె వ్యాధులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఆరునెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.



- డాక్టర్ భక్తవత్సలరెడ్డి,
అపోలో ఆసుపత్రి, గుండె వైద్య నిపుణులు

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు

గుండె వ్యాధులకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా వ్యాధి గ్రస్థులను కాపాడుతున్నాం. జిల్లాలో ప్రతినెలా 35 నుంచి 50 బైపాస్ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గుండె వ్యాధిగ్రస్థులు 80 శాతం మందిని మృత్యువు నుంచి బయట పడేందుకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం. పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్‌కు అలవాటు పడటం, వ్యాయామం లేక పోవటం గుండెపోటుకు కారణంగా ఉన్నాయి.



- డాక్టర్ శ్రీనివాసరాజు,
కిమ్స్ ఆసుపత్రి, గుండె వైద్య నిపుణులు

ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి..

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌ను ఓ వ్యక్తి కత్తితో చంపుతానని బెదిరించి నగదు దోచుకెళ్లిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేట ఉప్పరపాలెంకు చెందిన టీ.గోపి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన ఈనెల 27వ తేది రాత్రి ఉప్పరపాలెం సెంటర్ వద్ద ఆటోను ఆపుకుని ఉండగా అదే ప్రాంతానికి చెందిన డీ సాయి రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేశా డు. గోపి లేవని చెప్పడంతో దాడి చేసి కత్తితో చంపుతానని బెదిరించి వెయ్యి నగదు దోచుకెళ్లాడు. ఈ విషయం బయట చెబితే చంపుతానని నిందితుడు బెదిరించాడు. ఈ మేరకు బాధిత ఆటో డ్రైవర్ ఆదివారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జీ దశరథ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌పీఎస్‌డబ్ల్యూ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ది ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఎఫ్‌పిఎస్‌డబ్ల్యు) ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదివారం నగరంలో ఆ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడుగా బండారు మాల్యాద్రి, జనరల్ సెక్రటరీగా పోకూరి మాల్యాద్రి, కోశాధికారిగా కుడుముల సంతోష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా దుగ్గిశెట్టి వెంకటసురేష్, జాయింట్ సెక్రటరీగా లక్కాకుల మాధవరావు ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గానికి ఎంపికైన సభ్యులు



గ్రావెల్ తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల సీజ్

కావలి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్రకోట నుండి ఎలాంటి అనుమతులు లేకుం డా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను ఆదివారం రూరల్ ఎస్‌ఐ బాజీబాబు సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. జాతీయ రహదారికి పడమట ఉన్న తిప్ప నుండి గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ బాజీబాబు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్ట ర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

● యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం, నాయకుడు జ్యోతిబసు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా మహాసభ జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత ఎన్నికల్లో టీడీపీ హామీ ఇచ్చిందని, దానిని నెరవేర్చాలని కోరారు. ఏళ్లు నిండిన వారిని అర్ధంతరంగా ఇంటికి పంపడం దుర్మార్గమన్నారు. 12వ పీఆర్‌సీ వెంటనే వేయాలని, సమ్మె కాలపు ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 35 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనర్సయ్య, నాయకులు కొండా ప్రసాద్, సుధాకర్, కృష్ణమూర్తి, కామాక్షమ్మ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సామ్రాజ్యం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10,902
వెండి కిలో ధర	రూ. 1,47,500
వెండి ఒక గ్రాము	రూ.150.50

ఘనంగా గుర్రం జాషువా జయంతి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయంలో భారత్ సేవా ఫౌండేషన్, జాషువా గ్రంథాలయ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జాషువా రచించిన కాటి సీను పద్యాలను ఆలపించి భద్రాచలం దళితబాబు అందరినీ ఆకట్టుకున్నారు. గుర్రం జాషువా గ్రంథాలయం కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం, విద్యావేత్త లతీఫ్‌కుట్టి, కుసుమకుమారి, ఏవీ సుబ్బారావు, డయాడాట్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిర్మాణి హుస్సేన్, సయ్యద్ సలీం, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అలరించిన దసరా వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం టౌనుహాలులో చిన్నారులచే విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన చిన్నారులు వివిధ దేవతా భంగిమలో ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారులు పాడిన భక్తిగీతాలు శ్రోతలను అలరించాయి. ఒకటో తరగతి చదువుతున్న ధ్రువకుమార్ రాజ్ దేవి శ్లోకాలు పాడడం విశేషం. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, కృష్ణ, అబ్దుల్, వెంకటరామిరెడ్డి, నిహారిక, సుధారాణి పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి విడవలూరు రమాదేవి మనవడు బెన్నెట్ శ్యామ్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం నిత్యావసర వస్తువులను అందచేశారు. కేక్ కట్ చేసి స్నాక్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, మానవ సేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు అరవ పరిమళ, విశ్రాంత సీహెచ్‌వో జయశ్రీ, సీహెచ్ తేజ, సర్వేపల్లి రంజిత్, పీహెచ్‌ఎన్ ప్రపుల్లా తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 10న ఎర్రచీర సినిమా విడుదల

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళికి వారం ముందే అక్టోబరు 10న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న ఎర్రచీర ది బిగినింగ్ సినిమాను ప్రతి ఒక్కరు చూడాలని డైరెక్టర్ సుమన్‌బాబు కోరారు. ఆదివారం జిల్లా జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బేబీ డమరి సమర్పణలో శ్రీపద్మాలయ ఎంటర్‌టైన్‌మెంట్స్ శ్రీసుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఎర్రచీర ది బిగినింగ్‌లో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయితేజస్విని నటించిందన్నారు. అక్టోబరు 3న రిలీజ్ ట్రైలర్ విడుదల చేసి, 5న విజయవాడలో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపారు. 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ చిన్న సినిమాలను కూడా సినిమాహాలు యాజమాన్యం, ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో శివలంకి జనార్దన్, నెల్లూరు సినిమా అసోసియేషన్ అధ్యక్షుడు రావూరు వెంకట్, నటులు, ఎన్‌సీపీ మెంబర్ మీరాకిల్‌మీరా, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అమ్మణ్ణుల అలంకరణలు



ఎన్టీఆర్‌నగర్‌లో కరెన్సీతో ధనలక్ష్మి అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మణ్ణుల అలంకరణలు కనువిందు చేశాయి. రాజరాజేశ్వరి ఆలయంలో అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సంపుటీకరణ, చండీహోమం జరిగాయి. కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. అమ్మవారు కాళికాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజితమ్మ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలవర్లుకు తామరపూలతో అలంకారం జరిగింది. ఉత్సవమూర్తి ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- ఇరుకళల పరమేశ్వరి భక్తులకు దుర్గాగా దర్శనమిచ్చారు. ఆలయ ఈవో గిరికృష్ణ, పర్యవేక్షించారు.
- మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరికి చండీ అలంకారం జరిగింది. ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులరెడ్డి పర్యవేక్షించారు.



రాజరాజేశ్వరికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, సుజితమ్మ దంపతులు

- పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ, గాయత్రీదేవిలకు పార్వతీదేవి అలంకారం వైభవంగా జరిగింది. కార్యక్రమాలను పట్టణ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యఆచారి పర్యవేక్షించారు.
- మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి అన్నపూర్ణాదేవి అలంకారం, విశేష పూజలు జరిగాయి. ఈవో యు.జానకమ్మ పర్యవేక్షించారు.
- నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి మహా చండీదేవి అలంకారం జరిగింది.



కన్యకాపరమేశరి మూలవర్లకు తామర పుష్పాలతో అలంకరణ

- కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో మహాలక్ష్మి అలంకారం వైభవంగా జరిగింది.
- పప్పులవీధిలో మహాలక్ష్మి ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు, పుష్పాలంకారం, ఊంజల్‌సేవలు జరిగాయి.
- సిద్ధివిఘ్నేశ్వరాలయంలో అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం కనుల పండువగా జరిగింది.
- వేదాయపాలెంలో వేంచేసి ఉన్న గురువాయుర్ మహావిష్ణు ఆలయంలో మహాలక్ష్మికి ధాన్యలక్ష్మి అలంకారం చేశారు.
- ఎన్టీఆర్‌నగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ.లక్ష కరెన్సీ నోట్లు, చిల్లరతో అమ్మవారిని అలంకరించారు.
- **నెల్లూరురూరల్ :** వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారు విద్యాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించిన ఆలయ అర్చక బృందం అనంతరం ప్రత్యేక అలంకరణ మందిరంలో అమ్మవారి భక్తుల దర్శనార్థం ఉంచారు.

పెంపుడు జంతువులకు రేబిస్ నివారణ టీకాలు వేయించాలి

● పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ సోమయ్య



కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ సోమయ్య

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు యజమానులు క్రమం తప్పకుండా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ.సోమయ్య పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డులోని వెటర్నరీ పాలీ క్లీనిక్‌లో ఏడీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉచితంగా కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేయడంతోపాటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు మాలకొండయ్య, రామచంద్రరావు, వీఏఎస్ జయప్రకాష్, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛభారత్'

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు రెయిన్‌బో సీబీఎస్‌ఈ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ధనలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో చెత్తను తొలగించడంతో పాటు చెత్త వలన కలిగే అనర్థాలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. సుబేదార్ హేమంత్‌కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్స్ సమాల్, రాజ్‌పాల్, ఎన్‌సీసీ అధికారులు మస్తాన్‌వలి, శ్రీపతి ప్రసాద్, జయరాం, జావీద్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డను కలిపిన ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



తల్లి చెంతకు చేరిన బిడ్డతో నాయకులు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిరాడంబరంగా జరిగిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఓ తల్లీ బిడ్డను కలిపాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాల మేరకు.. పెన్నాకొత్త వంతెన సమీపంలోని సాలుచింతలకు చెందిన గిరిజన మహిళ నిమ్మల శేషమ్మ కుమారుడు పోలయ్య(9) రెండేళ్ల క్రితం తప్పిపోయాడు. అతనిని కొందరు చెన్నైలోని రోడ్డు మార్జిన్ వ్యాపారుల వద్ద పనిలో పెట్టారు. అక్కడ తమిళనాడుకు చెందిన బాలల సంరక్షణ అధికారులు అదుపులోకి తీసుకుని రైల్వే పోలీసుల ద్వారా నెల్లూరులోని పోలీసు హాస్టల్‌కు తరలించారు. రెండేళ్ల నుంచి అక్కడే ఉంటున్నాడు. ఈనెల 26వ తేదీన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ అంబేడ్కర్ భవన్‌లో అన్నదానం కార్యక్రమం చేపట్టి పోలీసు హాస్టల్లో ఉంటున్న 13 మంది చిన్నారులను అక్కడకు తీసుకువచ్చారు. అలాగే ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న గిరిజనులను అక్కడకు పిలిచి అన్నదానం చేశారు. ఈ క్రమంలో యాదృచ్ఛికంగా తన తల్లిని చూసిన పోలయ్య అమ్మా... అంటూ ఆమె వద్దకు వెళ్లాడు. ఆమె కూడా అతనిని గుర్తుపట్టి అక్కున చేర్చుకుంది. ఈ సంఘటన ఆదివారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధిపై పోరాటం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పోరాడుతామని డీవైఎఫ్ఐ జిల్లా, నగర కార్యదర్శులు రమణ, నరసింహ పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 15వ డివిజన్‌లో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేతలు తిరుపతి, జగదీష్, సురేంద్ర, శేఖర్, కృష్ణ, కళ్యాణ్, రిజ్వాన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



రైతులతో మాట్లాడుతున్న జమలయ్య

నెల్లూరురూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడగారులో చేతికందిన ధాన్యం దళారులు పాలు కాకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా నాయకులతో కలిసి సౌత్ మోపూరులో ధాన్యం రాసులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పీపీసీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఎంఎస్పీకి ధాన్యం కొనుగోలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలుకు రైతులకు గుర్తింపు కార్డు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజగోపాల్, శివప్రసాద్, పముజుల హరి, రాంబాబులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలి

నెల్లూరు(వైద్యం): సంతపేట మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బట్టల వ్యాపారులకు రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జమలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సంతపేట మార్కెట్‌ను సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, బాధితులు పాల్గొన్నారు.

వేదాంత దేశీకర్ ఆలయంలో తిరునక్షత్ర మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రంగనాయకులపేటలోని వేదాంత దేశీకర్ దేవస్థానంలో ఆదివారం అహోబిలం మఠం వ్యవస్థాపకులు ఆదివన్ శతగోప స్వామి తిరునక్షత్ర మహోత్సవం ఘనంగా జరిగింది. సుప్రభాతం, శ్వేత ఉత్సవం, పినాకినీ నదీ తీర్థములతో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేదాంత దేశీకర్ స్వామికి, ఆదివన్ శతగోపస్వామికి, నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం శేషవాహన సేవ, పల్లకీ ఉత్సవం జరిగింది. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కేసీ వరదరాజన్, ఎన్‌సీ బాలాజీ, రమేష్, బి.రాజగోపాల్ పర్యవేక్షించారు.

రెడ్‌క్రాస్‌లో ప్రపంచ రేబిస్ నివారణ దినం



లూయిపాశ్చర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెడ్‌క్రాస్ ఏఆర్‌వీ క్లినిక్‌లో ఆదివారం ప్రపంచ రేబిస్ దినం నిర్వహించారు. రేబిస్ వ్యాధి టీకాను కనుగొన్న లూయిస్ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఆర్‌వీ క్లినిక్ కన్వీనర్ బిరుదువోలు వెంకురెడ్డి మాట్లాడుతూ 1996లో ఈ రేబిస్ వ్యాక్సిన్ సెంటర్‌ను ప్రారంభించారని, ఏడాదికి 17వేల మందికి ఈ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. కుక్కల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌వీ కమిటీ సభ్యులు రాఘవేంద్రరావు, ఎల్లయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, తిమ్మరాజు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు



నాదెండ్ల మనోహర్‌తో సుజయ్‌బాబు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, పలువురు నాయకులు ఆదివారం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహ ర్ జిల్లాలో జనసేన పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.



ప్రజల సహకారంతో పరిశుభ్రత చర్యలు

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ముషీధర్

వెంకటాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చేపడుతున్నామని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ షేక్ ముషీదర్ కోరారు.

ముఖాముఖి

?. పారిశుధ్యం మెరుగునకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

!. అన్ని పంచాయతీల్లో ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మురుగు కాలువలను శుభ్రం చేయడంతోపాటు వీధులను శుభ్రం చేయి స్తున్నాం.

?. నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారా

!. ప్రతీ 15 రోజుల కొకసారి నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అంది స్తున్నాం.

?. చెత్తకుండీలు ఏర్పాటు చేశారా

!. ప్రజలు చెత్త ఎక్కడపెడితే అక్కడ వేయకుండా కుండీలను ఏర్పాటు చేశాం.

?. గ్రామాల్లో రోడ్డు పక్కన పేడదిబ్బలు తొలగించారా

!. గ్రామాల్లో రోడ్డు పక్కన పేడ దిబ్బలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దిబ్బలు వేసేవారికి నోటీసులు ఇచ్చాం. ఎక్కడపడితే అక్కడ పేడదిబ్బలు వేస్తే చర్యలు తీసుకుంటాం.

?. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా

!. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులు, ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎంపీడీవో కల్పన ప్రత్యేక దృష్టి సారించారు.

జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందాల్సిందే!

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పొదలకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో వచ్చే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 16 లోపు ఆక్వా సాగుకు రైతులు లైసెన్సులు పొందాలన్నారు. ప్రస్తుతం కొన్ని వస్తువులపై అసలు జీఎస్టీ లేకపోగా, కొన్నింటికి 5, 18 శాతం శ్లాబులకు పరిమితం చేశారన్నారు. ఫలితంగా అనేక రకాల వస్తువుల ధరలు తగ్గిపోతున్నాయన్నారు. 18 శాతం పన్ను కూడా ఏసీలు, టీవీలు, ఖరీదైన వాహనాలపైనే ఉందన్నారు. పొగాకు, పాన్ మసాలా, లగ్జరీ కార్లపైన మాత్రమే 40 శాతం పన్ను విధించారన్నారు. పాలు, గుడ్లు, తదితర ఆహార పదార్థాలపై జీఎస్టీని తొలగించారన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు టీడీపీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, టీడీపీ నాయకులు పులిపాటి వెంకటరత్నంనాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, అరుణమ్మ, వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ

జాతిపిత మహాత్మాగాంధీ ఆచరించి చూపిన అహింసా మార్గంలో నడవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు అమర్త లూరు చెంచయ్య, ఏఎంసీ డైరెక్టర్ పిన్నేల ప్రభాకర్, ఆకు లూరి విజయకుమార్, పొట్టి సుధాకర్, తన్నీరు సురేష్ కుమార్, రాజా, సురేంద్రబాబు, గుర్రం మీరామధు, రాచ పూటి ధనుంజయరావు, శీతాళం వెంకట రమణయ్య, తన్నీరు సురేష్‌బాబు, దామిశెట్టి రవీంద్ర బాబు, పైడా కామేశ్వరరావు, క్రిష్ణం వెంకటరమణయ్య, ముత్తుకూరు, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



పొదలకూరులో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

టీడీపీలోకి పలువురి చేరికలు

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలుస్తున్న తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతు న్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ సీనియర్ నాయకుడు పులిపాటి వెంకటరత్నం నాయుడు ఆధ్వర్యంలో మండలం లోని పులికల్లు గ్రామ పంచాయతీకి చెందిన 36 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పొదలకూరులో సర్వే పల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొమ్మి శ్రీనివాసులు, ఆవుల శంకరయ్య, గంపల శ్రీనివాసులు, కూరపాటి రంగయ్య, కొమ్మి వెంకటరత్నం, సిద్ధం పెంచలయ్య, చిన్నపెంచలయ్య, నిమ్మళ్ల నారయ్య, అంకయ్య, పెంచలయ్య, చెంచురామయ్య, ప్రసాద్, శివప్రసాద్, గుండోలు పెంచలయ్య, నిమ్మళ్ల శివకుమార్‌ల, రామయ్య, చలంచర్ల రమణమ్మ, నల్లు చెంచురామయ్య, కొమరిగిరి పెంచలయ్య, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పిన్నేల ప్రభాకర్‌రెడ్డి, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, అరుణమ్మ, సుగుణమ్మ, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చవటపాళెం ఎస్సీ కాలనీలో శ్రీ పుట్టాలమ్మ తల్లిని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాకవి జాషువాకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జనవిజ్ఞానవేదిక, యూటీఎఫ్ నాయకులు

కోవూరు, సెప్టెంబరు, 28 (ఆంధ్రజ్యోతి): ప్రము ఖ కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యా లయంలో ఆదివారం ఆ యన చిత్రపటానికి జన విజ్ఞాన వేదిక, యూటీ ఎఫ్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జే శ్రీనివాసులు మాట్లాడుతూ సుకవిగా ప్రజల నాలుకలపై జాషువా నిలచిపోయారన్నారు. అంటరాని తనాన్ని ఎదిరించి నిలచిన మహాకవిగా చరిత్రలో నిలచిపోతారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ కార్యదర్శి శ్రీశైల, యూటీఎఫ్ జిల్లా నాయకులు ఖాజా వలి, చేబ్రోలు వేంకటేశ్వర్లు, రహంతుల్లా, గౌస్ అస్లాం బాష, జయప్రకాష్, బుజ్జయ్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా పద్యాలను ఆలపించిన చిన్నారులు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక గోపాలకృష్ణయ్య పాఠశాలలో సామాజిక సమరసత వేదిక అధ్యక్షుడు నరసింహామూర్తి అధ్యక్షతన ఆదివారం గుర్రం జాషువా 130వ జయంతి ఘనంగా జరిగింది. కార్యదర్శి సుధీర్, కన్వీనర్ ఇనుగూరు సుబ్బారావు, నేలనూతల శ్రీధర్, విశ్రాంత ఉపాధ్యాయులు చెన్నయ్య, సోమయ్య, గుంజి నాగభూషణం, నాగేశ్వరి, కామాక్షమ్మ, కోనమ్మ తదితరులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా పద్యాలను శ్రావ్యంగా ఆలపించిన చిన్నారులకు వేదిక నిర్వాహకులు పుస్తకాలు అందజేశారు.

దర్జీల సంక్షేమానికి కృషి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తుందని రాష్ట్ర టైలర్ల ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి తెలిపారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం టైలర్లతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షుడు గులాం ఖాదర్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, రేఖ, బాబు, జిల్లా ఉపాధ్యక్షుగు యానాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో ఆదివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండె వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి, డాక్టర్ జయరామయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పోకల రవికి జన్మదిన శుభాకాంక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ పోకల రవికి జనసేన పార్టీ నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ గునుకుల విజయలక్ష్మి, నాయకులు నక్కల శివకృష్ణ, సురేంద్ర పిల్లేల, బెల్లపు సుధామాధవ్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణపురంలో ఉన్న ఓ మద్యం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి సీలింగ్ రేకులను తొలగించి, రూ.2 లక్షల నగదును దోచుకెళ్లాడు. ఆదివారం క్యాషియర్ ప్రదీప్ షాపు తెరిచి లోపలికి వెళ్లి చూడగా, క్యాష్ కౌంటర్ కింద రూ.500 నోటు పడిఉంది. దీంతో ప్రదీప్ చోరీ ఘటన పై షాపు యజమానికి తెలిపాడు. నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బంగారు గొలుసు...

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం మండలం అయ్యవారిపల్లికి చెందిన జయమ్మ ఆత్మకూరు బస్టాండులో బస్సు ఎక్కుతుండగా ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు లాక్కెళ్లాడు. దీంతో బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మి అలంకారంలో కామాక్షితాయి అమ్మవారు



రాపూరు : గోపూజ నిర్వహిస్తున్న విజయేశ్వరీదేవి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లి కార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కామాక్షితాయి అమ్మవారు ఆదివారం శ్రీ మ హాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉద యం అభిషేకం, నవావరణ పూజలు చేశారు. రాత్రి స్వామివారికి అభిషేకం, అ మ్మవారికి నవావరణ పూజ లు చేసి కొలువులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. ప్రత్యేక పుష్పాలంకరణలో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సోమ వారం కామా క్షితాయి అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పెద్దూరులో కొలువైన సీతా, లక్ష్మణ సమేత శ్రీకోదండ రామస్వామి ఆలయంలో కోదండ రాముడు శ్రీ మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమి చ్చారు. సోమవారం శ్రీ సరస్వతీదేవి మోహినీ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. రామకృ ష్ణానగర్‌లో కొలువైన శ్రీ కళ్యాణ వేంక టేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణ వేంకటేశ్వరుడు ధాన్యలక్ష్మి అలంకారంలో ద ర్శనమిచ్చారు. సోమవారం విద్యాలక్ష్మి అలంకారంలో ద ర్శన మివ్వనున్నారు.

రాపూరు : పెంచల కోనలోని దేవస్థానంలో ఆదిలక్ష్మీ అమ్మవారు ఆదివారం విజయలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం అమ్మవారికి పంచామృతాలు, నారికేళ రసాలు, తొమ్మిది రకాల పండ్ల రసాలతో అభిషేకించి, అనంతరం స్నపనం నిర్వహిం చారు. శ్రీవారి నందనవనంలో పద్మ పీఠంపై విజయలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు విజయలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారు విద్యాలక్ష్మి అలంకా రంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మాతృ శ్రీ విశ్వశాంతి ఆశ్రమంలో దేవతామూర్తులు శాకాంబరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

పొదలకూరు : పట్టణంలోని శ్రీరామలింగ చాముండేశ్వరి దేవాలయంలో ఆదివారం అమ్మవారికి సహస్ర నామ, అష్టోత్తర పూజలు, లలి తా సహస్ర నామ పూజలు నిర్వహించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
కోడిగుడ్ల ధర (100)	550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,902
వెండి కిలో ధర	రూ. 1,47,500
వెండి ఒక గ్రాము	రూ.150.50

చేతిపంపునకు మరమ్మతులు

అనంతసాగరం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బద్వేల్ రోడ్డు కూడలి వద్ద ఉన్న చేతిపంపు తుప్పుపట్టి అధ్వానంగా ఉండడంతో ఇటీవల తప్పుపట్టిన చేతిపంపు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి తప్పుపట్టిన పరికరాలు మార్చి కొత్త వస్తువులు బిగించారు. చేతిపంపు వినియోగంలోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి సత్కారం



ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు

కావలి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు, బిట్రగుంట రైల్వే అభివృద్ధి ఆవశ్యకత గురించి అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గళం వినిపించడం అభినందనీయమని టీడీపీ నేతలు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బోగోలు మండల టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, విశ్రాంత రైల్వే ఉద్యోగులు ఎమ్మెల్యేని సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు.

రేపటి నుంచి యూరియా పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాళెం సహకార సంఘానికి 18 టన్నులు (400 బస్తాలు) యూరియా మంజూరైందని మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి దుత్తలూరులోని సొసైటీ గోదాము నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పంట సాగు చేసిన రైతులు 1బీ, ఆధార్‌కార్డుతో వస్తే బస్తా రూ266.50 చొప్పున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓవీ రోడ్డులో జరుగుతున్న వైండింగ్ పనుల్లో భాగంగా 11 కేవీ సిటీఆర్ఐ ఫీడర్ నుంచి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, సబ్‌కలెక్టర్ కార్యాలయం, మోర్ సూపర్‌మార్కెట్, వాణీనగర్, రమణారెడ్డి పెట్రోల్ బంక్ ఏరియా, వాసవీ నగర్, ప్రకాశం కాలనీ, రెవెన్యూ కాలనీ, సీటీఐర్ ఏరియాల్లో వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కందుకూరు : వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి దంపతులు



బిట్రగుంట: మహాచండీదేవి అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి



కావలి రూరల్ : చండీశ్వరీదేవి అలంకారంలో దుర్గా భ్రమరాంబ అమ్మవారు

కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా కందుకూరులోని పెద్ద బజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కందుకూరు శాసన సభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు ఆదివారం వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాజాస్వామి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటూరి దంపతులు వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు నిర్వహించిన లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్న సౌజన్యకు అమ్మవారి పసుపు, కుంకుమ అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, చక్కా వెంకట కేశవరావు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, కోటా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● **కావలి రూరల్:** కావలి పట్టణంలోని కలుగోళ శాంభవి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు. శేష వాహన సేవలందు కున్నారు. విష్ణు ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో పూజలం దుకున్నారు. శివాలయంలో దుర్గా భ్రమరాంబ అమ్మవారు చండీశ్వరీదేవి అలంకరణలో, కొత్తబజారు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వడ్డిపాలెంలోని కనకదుర్గ అమ్మవారు కాత్యాయినీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా పువ్వులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బృందావన కాలనీలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవతా మూర్తులకు మోహినీ పల్లకీ ఉత్సవం, లక్ష్మీకాసుల మాల, గరుడ వాహన ఉత్సవాలు నిర్వహించారు.

● **అల్లూరు :** పట్టణ పరిధిలోని శక్తి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కలుగోళమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల నుండి అమ్మణ్ణులు పల్లకి సేవలు అందుకున్నారు. మహిళా భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● **బిట్రగుంట :** బోగోలు మండలంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బోగోలు షిర్డీ సాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్థల వివాదం పరిష్కరిస్తా : ఎమ్మెల్యే ఇంటూరి



ఎమ్మెల్యే ఇంటూరితో చర్చిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జర్నలిస్టులు

కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో జర్నలిస్టు కే హరిబాబు స్థలాన్ని కొందరు కబ్జా చేసిన వ్యహారంపై విచారించి తగు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సమస్యపై ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు కందుకూరు జర్నలిస్టులతో కలిసి ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గతంలో జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇచ్చారని, ఇది చట్టబద్ధంగా విలేకరికి లభించిన స్థలం అని, దీనిని కొందరు వివాదాస్పదం చేయడం సరికాదన్నారు. స్థానికులు దీనిపై రకరకాల ప్రచారాలు చేస్తున్నారని, వాస్తవాలు విచారించుకోవాలని ఎమ్మెల్యేకి సూచించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఎవరిపై వ్యక్తిగత ద్వేషం లేదని, ఖచ్చితంగా జర్నలిస్టులకు న్యాయం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

రైతు పక్షపాతి ఎమ్మెల్యే దగుమాటి



మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి రైతు పక్షపాతి అని, రైతుల సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించేలా కృషి చేశారని నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ వేంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బోగోలు మండలం చెంచులక్ష్మీపురం పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు ఎం నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బాటలో నడుస్తూ కావలి ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాగులవరం పీఏసీఎసస్ డైరెక్టర్లు ఎల్ మాధవరావు, వీ సుధాకర్, టీడీపీ నేతలు కే వెంకటేశ్వరరెడ్డి, జీ నాగరాజు, మాకాఅర్జున్‌రాజ్, పీ వెంకటస్వామి, పీ సుబ్బారావు, పీ శీనయ్య, సీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి



ఆత్మకూరు: గుర్రం జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న తెలుగు భారతి సేవా సమితి నిర్వాహకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం ప్రాంగణంలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు ఎస్ సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడు అంకినపల్లి గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు కెవి శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఆర్థిక కార్యదర్శి ఒమ్మిన సుబ్రహ్మణ్యం ఉపాధ్యక్షులు రామయ్య స్వామి, ఓంకారం శ్రీనివాస రాజు, ప్రచార కార్యదర్శి కలిశెట్టి రవీంద్ర కుమార్, ఎస్‌వి రమణయ్య సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కావలి :** మహాకవి గుర్రం జాషువా జయంతి సభ ఆదివారం స్థానిక వెంగళరావునగర్‌లోని విశ్వశాంతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో ఘనంగా జరిగింది. తెలుగు ధ్యానపీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు డాక్టర్ జిల్లా శ్రీనివాసులు, లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి, కరస్పాం డెంట్ రమణయ్య, రోటరీక్లబ్ సభ్యుడు మల్లికార్జున, సామాజిక కార్యకర్త మురళి తదితరులు జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సాహితీ సేవలను స్మరించుకున్నారు.

లింగసముద్రం : సమాజంలోని అసమానతలు, వివక్షతలకు, దోపిడీకి వ్యతిరేకంగా రచనలు సాగించిన యోధుడు, మహాకవి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మాజీ సర్పంచు, మంచుపొగ రచయిత ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి బాలకోటయ్య, సర్పంచు పులి పెద రాఘవులు, తెలుగు పండిట్ మార్తాటి మాల్యాద్రి, కె కోటేశ్వరరావు, హార్మోనిస్టు దేవకి హరనాథ్‌బాబు, షేక్ బాషా, ఎంపీటీసీ డి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

41 మద్యం సీసాల స్వాధీనం

ఉలవపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దిపూడి గ్రామం వడ్డెరపాలెంకు చెందిన తన్నీరు రాంబాబు అక్రమంగా మద్యం అమ్ముతూ ఆదివారం పట్టుబడినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. అందిన సమాచారం మేరకు రాంబాబు ఇంటికి వెళ్లి పరిసరాలను సోదా చేయగా గోనెసంచిలో 41 మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

వింజమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, మిగతా ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలియజేశారు.

కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాధి టీకా వేయించాలి : ఏడీ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి టీకా తప్పనిసరిగా వేయించాలని ఏడి చెన్నకేశవులు సూచించారు. వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవం సదర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి చెన్నకేశవులు మాట్లాడుతూ రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి అని, ఇది కుక్కల నుండి మనుషులకు సంక్రమిస్తుందని, వ్యాధి రాకుండా ముందుగా టీకాలు వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్, సిబ్బంది కొండారెడ్డి, కిరణ్‌కుమార్, శరత్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి అలంకారాలు



ఆత్మకూరు: అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి పూజలు చేస్తున్నఅర్చకులు



సంగం: చండీదేవి అలంకారంలో కామాక్షిదేవి



ఉదయగిరి : మహచండీ అలంకరణలో పార్వతీదేవి

ఆత్మకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలలో అమ్మవారు వివిధ అలంకారాలలో భక్తులకు కనువిందు చేస్తున్నారు. పట్టణంలోని అన్నపూర్ణదేవి సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో



తూర్పురొంపిదొడ్లలో కాళరాత్రి అలంకరణలో మానసాదేవి

ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

● **సంగం:** స్థానిక సంగమేశ్వరాలయంలో అమ్మవారు ఆదివారం చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

● **ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీ నగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు మహాచండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరికుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, గ్రామ దేవత అంకాలమ్మ గుడి, నారాయణమ్మపేటలో విజయకనక దుర్గాదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు ఆదివారం దర్శనం ఇచ్చారు. అంకాలమ్మగుడి వద్ద రామిశెట్టి వెంకటయ్య, రమణమ్మ దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సీతారామపురం: గాయత్రిదేవి అలంకారంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవి

ఎమ్మెల్యే కాకర్ల చొరవతో శ్మశానానికి రోడ్డు సౌకర్యం



సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవంలో కూటమి నాయకులు

సీతారామపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జనసేన పార్టీ నా సేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావుల చొరవతో మండల కేంద్రంలోని రంగుబావి వద్ద నుంచి ముస్లింల శ్మశాన వాటిక వరకు నూతన సిమెంట్ రోడ్డును మంజూరు చేయడం జరిగిందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ తెలిపారు. ఆదివారం మండల కూటమి నాయకులు నూతన సిమెంట్ రోడ్డు, బ్రిడ్జి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మండల ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి శ్మశాన వాటికకు, రైతులు పొలాల్లోకి వెళ్ళుటకు దారిలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఎంతమంది రాజకీయ నాయకులకు తమ సమస్య చెప్పినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జనసేన నాయకుడు భోగినేని కాశీరావు దృష్టికి తీసుకెళ్లగా వారి చొరవతో నూతన సిమెంట్ రోడ్డు, బ్రిడ్జి మంజూరుచేసి, వేయించడం ఎంతో సంతోషంగా ఉందని, వారికి ముస్లింల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), మండల ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, షేక్ పెద గౌస్, టిడిపి గ్రామ అధ్యక్షుడు దేవర వెంకటేశ్వర్లు, జయరాములు, వెంగళశెట్టి వెంకట్రావ్, తమ్మిశెట్టి రమణయ్య, తోట ఏడుకొండలు, పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో ఆదివారం లక్ష్మీ చెన్నకేశవస్వామి కొణతాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మేదసాని వంశస్థుల ఆధ్వర్యంలో కోయిలంపాడు, గడ్డంవారిపల్లి చెన్నకేశవ స్వామి కొణతాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే గంగాభవానీకి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. పోతురాజుకు బోనం సమర్పించిన ఆచారవంతులు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మకు ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతోపాటు కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని ప్రత్యేక పూజలు చేపట్టారు.

గరుడ వాహనమెక్కి..



దిగ్గున వెలిగే దీపకాంతులు.. హోరెత్తే గోవిందలు.. గిరిజన నృత్య విన్యాసాలు.. జతగా వాయిద్యాల ఘోష.. 'ఇటు గరుడని నీవెక్కినను.. పటపట దిక్కులు బగ్గన పగిలె' అని అన్నమయ్య వర్ణించినట్టుగానే ఆదివారం రాత్రి తిరుమల కొండమీద గరుడోత్సవం సాగింది. మాడవీధులు భక్తజన సముద్రంగా భాసిల్లాయి. లక్ష్మీకాసుల హారం ధరించిన శ్రీనివాసుడు తన ఇష్టవాహనమైన గరుడుడిని అధిరోహించి గజ, వృషభ దళాలు ముందు నడుస్తుండగా మందగమనంతో విహరించాడు. రాత్రి నుంచే చలిని లెక్కచేయకుండా గ్యాలరీ మెట్లనే పడకలుగా మార్చుకున్న భక్తులు.. పగటి ఎండకు దుప్పట్లకింద తల దాచుకుని గరుడుడిపై ఊరేగుతూ వచ్చే స్వామికోసం ఎదురు చూశారు. ప్రకటించిన సమయంకన్నా 23 నిమిషాల ముందే గరుడవాహన సేవ మొదలైంది. ఉండి ఉండీ కురిసే జల్లుల నడుమ మాడవీధుల్లోని లక్షలాది భక్తజనానికి దర్శనమిస్తూ ముందుకు సాగింది.

● 6 గంటల పాటు సాగిన గరుడోత్సవం ● 23 నిమిషాల ముందే కదిలిన వాహనం ● 2.4 లక్షలమందికి వాహన దర్శనం ● భక్తజన సముద్రాన్ని తలపించిన తిరుమల

23 నిమిషాల ముందే..

సాయంత్రం 6.30 గంటలకు గరుడ సేవ ప్రారంభిస్తామని టీటీడీ ప్రకటించింది. కానీ, ఉదయానికే గ్యాలరీలన్నీ నిండి మాడవీధులు రద్దీగా మారాయి. దీంతో నిర్ణీత సమయానికన్నా 23 నిమిషాల ముందే.. 6.07 గంటలకే వాహన సేవ ప్రారంభించారు. తొలుత బ్యాడ్జీలు కలిగిన వీఐపీలకు ఉత్సవమూర్తి దర్శనం చేయించి పంపారు. అనంతరం వాహనాన్ని ముందుకు నడిపారు.

2.40 లక్షల మందికి దర్శనం

ఉదయం 11 గంటలకంతా గ్యాలరీలు నిండటతో మాడవీధుల గేట్లను మూసేశారు. సాయంత్రం 4 గంటల సమయానికి 1.90 లక్షల నుంచి 2 లక్షల మంది గ్యాలరీల్లోకి చేరారని అధికారుల అంచనా. మరోవైపు కార్నర్ పాయింట్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 30 వేల నుంచి 35 వేల మంది దర్శనం చేసుకున్నారు. ఇలా, దాదాపు 2.40 లక్షల మందికి గరుడ సేవ దర్శనం లభించింది. మాడవీధుల వెలుపల దాదాపు 30 వేల నుంచి 40 వేల మంది ఉండొచ్చని, మూలవిరాట్టు దర్శనానికి కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, కృష్ణతేజ సర్కిల్ నుంచి అక్టోపస్ భవనం వరకు మరో 50 వేల మంది చొప్పున దాదాపు 3 లక్షల మందితో తిరుమల నిండిందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. మూలవిరాట్టు దర్శనానికి దాదాపు 36 గంటల సమయం పడుతుండటం గమనార్హం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం: 8-10మధ్య హనుమంత వాహనం
సాయంత్రం: 4-5మధ్య స్వర్ణ రథోత్సవం
రాత్రి: 7-9 మధ్య గజ వాహనం



ఘటాటోపం తీసుకొచ్చే క్రమంలో తోపులాట

వాహన మండపం నుంచి గరుడ వాహనం ప్రారంభమై 7.20 గంటల సమయంలో మహద్వారం వద్దకు చేరుకుంది. అక్కడి హారతి పూర్తయ్యాక ముందున్న గేటు వద్దకు తీసుకొచ్చి నాదనీరాజనం వైపున్న భక్తులకు దర్శనం కల్పించే సమయంలో వర్షం మొదలైంది. వెనకున్న ఘటాటోపాన్ని వాహనం వద్దకు తీసుకొచ్చే సమయంలో కొంతమంది ఉద్యోగులు, భక్తులు దీంతో పాటు రావడంతో భద్రతాసిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఓ బాలిక కింద పడిపోగా.. భద్రతాసిబ్బంది క్షణాల్లో ఆమెను పైకి లేపడంతో ప్రమాదం తప్పింది. వాహనం ముందూ వీఐపీల రద్దీ అధికంగా ఉంది. వాహనంతో పాటే ముందుకు నడుస్తున్న క్రమంలో సమయంలో కొంత గందరగోళం ఏర్పడింది.

24 గంటలకుపైగానే నిరీక్షణ

గరుడ వాహనంపై స్వామిని దర్శించుకునేందుకు 24 గంటలకుపైగానే భక్తులు నాలుగు మాడవీధుల్లో నిరీక్షించారు. శనివారం రాత్రి సర్వభూపాల వాహనసేవ కోసం మాడవీధుల్లోకి చేరిన పలువురు భక్తులు ఆదివారం రాత్రి నాటి గరుడసేవ కోసం అలానే ఉండిపోవడం గమనార్హం. టీటీడీ అందజేసే అన్నపానీయాలు స్వీకరిస్తూ గ్యాలరీల్లోని ఉండిపోయారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సీబీఎస్‌కు పోటెత్తిన భక్తులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గరుడసేవ చూసేందుకు వచ్చిన భక్తులతో ఆదివారం ఉదయం నుంచే తిరుపతి సెంట్రల్ బస్సు స్టేషన్ రద్దీగా మారింది. నిమిషానికో బస్సు వస్తున్నా సరిపోలేదు. బస్సుల్లో సీట్ల కోసం పోటీపడ్డారు. ఇక, కౌంటర్లో ఆరుగురు కండక్టర్లు టిక్కెట్లు జారీచేస్తున్నా భక్తులు క్యూలో బారులు తీరారు. రైల్వేస్టేషన్, విష్ణునివాసం వద్దా ఇదే పరిస్థితి. ఈ రెండు పాయింట్ల వద్దే బస్సులు నిండిపోవడంతో తిరుమల బైపాస్ రోడ్డులో స్థానికులు.. అలిపిరి బాలాజీ బస్టాండులోనూ భక్తులకు నిరీక్షణ తప్పలేదు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం బస్టాండులోనే తిష్టవేసి రద్దీని సమీక్షిస్తూ బస్సులను రప్పించారు. అదనపు మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సకాలంలో వ్యర్థాలు తొలగించక పోవడంతో కుండీలు నిండి.. దుర్గంధం వెలకొంది. సాయంత్రం 6 గంటల వరకు 88,872 మంది తిరుమలకు వెళ్లగా.. 61,184మంది కొండ దిగారు.


బస్సుల వద్ద పోటీపడుతున్న భక్తులు

2.04 లక్షల మంది

● రాత్రి 11 గంటల వరకు ఆర్టీసీలో ప్రయాణం

గరుడ సేవ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి 11 గంటల వరకు 2,04,090 మంది తిరుమల-తిరుపతి మధ్య ప్రయాణించారు. ఇందులో 1,05,040 మంది తిరుమలకు రాగా, 99,050 మంది కొండ దిగారు. 2011 రికార్డును ఈ ఏడాది అధిగమించడం గమనార్హం. ఆ ఏడాది 1,97,750 మంది భక్తులు అత్యధికంగా ప్రయాణించారు. తిరుమలలో పార్కింగ్ సమస్య నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఇతర వాహనాలను ఆపేయడంతో ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య పెరిగినట్టు అధికారులు తెలిపారు.

గరుడ వారధిపై ట్రాఫిక్ జామ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి గరుడ సేవకోసం సుదూర ప్రాంతాల నుంచి వాహనాలు, బస్సుల్లో భక్తులు వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 నుంచి దాదాపు ఐదు గంటల పాటు గరుడ వారధిపై ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయాయి. మామిడి కాయల మండీ నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దకు రావడానికి 45 నిమిషాలు పట్టిందని వాహనదారులు తెలిపారు. ముఖ్యంగా తిరుమలకు వెళ్లే వాహనాలన్నీ గరుడ వారధిపైనే రావడంతో ఆర్టీసీ బస్సులు, కార్లు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు గరుడ సేవ విధుల్లో ఉండటంతో గరుడ వారధిపై ట్రాఫిక్ జామ్ గురించి దృష్టి సారించలేదు. మరోవైపు సాయంత్రం 5 నుంచి మళ్లీ రాత్రి 8 గంటల వరకు గరుడ వారధిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. కొందరు ప్రయాణికులే దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకున్నారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులను దించే అలైటింగ్ పాయింట్ గరుడ వారధి కిందనే ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్ కావడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. పోలీసులు రంగంలోకి దిగి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



సంతృప్తికరంగా మలయప్ప దర్శనం

మధ్యాహ్నం ఎండకు ఎండుతూ.. సాయంత్రం వర్షానికి తడుస్తూ గరుడ సేవలో మలయప్ప దర్శనానికి భక్తులు అత్యధిక సమయం గ్యాలరీల్లో వేచి ఉన్నారు. దీంతో గ్యాలరీలకు అతి సమీపంలోకి గరుడవాహనాన్ని తీసుకెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు. గంటలకొద్దీ వేచిఉన్న భక్తులు కనువిందైన దర్శనంతో సంతృప్తిగా వెనుదిరిగారు. కళాబృందాలూ ఆరు గంటల పాటు నిరంతరాయంగా ప్రదర్శనలతో అలరించాయి. నాలుగు గజరాజులూ ఐదు గంటల పాటు స్వామి వాహనం ముందే నిలబడి సేవ చేశాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





చిత్రం: బత్తల ఆనంద్

హరి యవతారమీతడు అన్నమయ్య

శేషాచలవాసుని స్తుతించడానికే జన్మించాడా అనిపిస్తుంది తాళ్లపాక



అన్నమయ్య రాసి, పాడిన గీతాలను చూస్తే. 1408లో తాళ్లపాక గ్రామంలో పుట్టిన అన్నమయ్య తన 16వ ఏటనే తిరుమలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నాడు. 1503లో ఆఖరి శ్వాస విడిచేదాకా శ్రీనివాసుడిని కీర్తిస్తూనే గడిపాడు. దక్షిణ దేశంలో భజన సంప్రదాయానికి, పదకవితా శైలికీ ఆద్యుడైన అన్నమయ్యను పదకవితా పితామహుడు అంటారు. తన జీవితకాలంలో 32 వేల కీర్తనలు రచించాడు. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు తండ్రి రాసి, పాడిన కీర్తనలను రాగిరేకులమీద చెక్కించి భద్రపరిచాడు. వీటిలో 12,000 మాత్రమే లభించాయి. తిరుమల ఆలయంలో అన్నమయ్య సంకీర్తనా భాండాగారం ఉంది. ఇప్పటికీ తిరుమల ఆలయంలో సుప్రభాత సేవలో పదగానం చేసేది అన్నమయ్య వంశస్థులే. భక్తి, భావ, శృంగారాలు పెనవేసుకున్న గీతాలు అన్నమయ్యవి. 'నా వలన నీకు కీరితి, నీ వలన నాకు పున్నెము' అని పాడగలిగిన అంతరంగిక భక్తుడు అన్నమయ్య. తిరుమలలో అన్నమయ్య నివశించిన ఇల్లు కూడా గతంలో ఉండేది.

గరుడ సేవను తిలకించేందుకు గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులు



బంగారు చిలుక చేతబట్టి..

● శృంగార రసాధి దేవతగా ఊరేగిన శ్రీవారు

తిరుమల, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు ఆదివారం ఉదయం శ్రీవారు శృంగారరసాధి దేవతగా భక్తకోటికి దర్శనమిచ్చారు. అతిలోకసుంధరి దేవత రూపాన్నిదాల్చిన మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి సరసన తిరువీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశాడు. బ్రహ్మరథ సారథ్యంలో గజరాజులు, వృషభాలు ముందు కదులుతుండగా.. కళాకారుల నృత్యాలు వెన్నంటి సాగగా.. నాచ్చియార్ తిరుకోళంగా పిలువబడే బంగారు చిలుకను చేతపట్టుకుని, శ్రీవిల్లిపుత్తూరు నుంచి వచ్చిన మాలలను ధరించి, శ్వేత వస్త్రాలు ధరించిన స్వామి దంతపల్లకిలో ఊరేగాడు. పల్లకిలో వినూత్నభంగిమలో ఆశీనుడైన స్వామిని చూసి భక్తులు తన్మయులయ్యారు. శ్రీకృష్ణ లీలలు ఘట్టాల ప్రదర్శన భక్తులను అలరించింది.

మంత్రముగ్ధం.. మోహినీ ఆట్టం

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓ పక్క పల్లకీలో మోహినీ రూపంలో శ్రీనివాసుడు.. మరోపక్క కళాకారుల మోహినీ నృత్యరూపకం ప్రదర్శన.. ఆదివారం ఉదయం మాడవీధులు పులకించాయి. కేరళకు చెందిన కళాకారుల బృందం నృత్యభంగిమల్లో భావోద్వేగాలు భక్తులను ప్రదర్శనలో లీనం చేశాయి. ఇక కర్నాటక కళాకారుల భస్మాసుర యక్షగానం, దాసవాణి నృత్యవైభవం కనువిందు చేశాయి. రాజస్థాన్ కళాకారుల కల్బెలియా నృత్యాలు అలరించాయి. మధ్యప్రదేశ్ బదాయ్ గిరిజన జానపద కళాకారుల వేషధారణ ఆకట్టుకుంది. చత్తీస్‌ఘడ్ ప్రరవ్ పూజ, పంజాబ్ బంగ్రా నృత్యాలతో ఆ రాష్ట్రాల సంస్కృతులను తమ ప్రదర్శనతో ప్రతిభింబించారు. కిట్టయ్య లీలలు, ఢమరుక ధ్వని విన్యాసం, చెక్కభజనలు, డప్పులు, కోలాటాలు వంటి సాంప్రదాయ ప్రదర్శనలతో ఆదివారం ఉదయం వాహన సేవ ముందు కళాకారులు సందడి చేశారు.

గరుడ వైభవం.. కళల సంబరం

గరుడ వాహనం ముందు నెమలి ఆకారంలో మయూరాన్ని ఎక్కిన సుబ్రహ్మణ్యస్వామి వేషదారణ కనువిందు చేసింది. ఈ వేషధారి తన హావభావాలతో మెప్పించారు. శ్రీనివాస కల్యాణం, గుమార్, బేధర వేషం, బరేడి, టప్పేటగుళ్లు, తిమ్మా, భాంగ్రా, డోగ్రీ, కరక్కట్టం, పంటి నృత్యం, టిప్పని సంపెలు, జానపద నృత్య ప్రద్యనలు అకర్షణగా నిలిచాయి. ఇక కథయట్టం, ఉరియడి, నవదుర్గ యక్షగానం వంటి కళారూపాలు మైమరపించాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి























ఆటో బోల్తా : ప్రయాణికుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని సారాయంగడి సెంటర్ వద్ద ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. బారాషహీద్ దర్గావద్దకు వెళ్లేందుకు గుర్తుతెలియని వృద్ధుడు(70) పొదలకూరురోడ్డు పద్మావతి సెంటర్ వద్ద ఆటో ఎక్కాడు. సారాయంగడి సెంటర్ వద్దకు వచ్చేసరికి మితిమీరిన వేగంతో ఓ కారు వెనుక నుంచి ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలోని వృద్ధుడు తలకు తీవ్రగాయం కాగా, ఆటోడ్రైవర్ పెంచలయ్య, మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో వృద్ధుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడు బారాషహీద్ దర్గా వద్ద ఉండే మొహిద్దీన్‌గా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

రామాలయంలో చోరీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి గ్రామ రామాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆలయం గేటు తాళాలు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి అమ్మవారికి దాతలు అందించిన ఐదు తాళిబొట్లను చోరీచేశారు. అలాగే హుండీని కూడా పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించి సమీపంలోని పొలాల్లో హుండీని పడేశారు. ఆదివారం ఉదయం స్థానికులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సుమారు రూ.2 లక్షల విలువ గల నగలు, నగదు చోరీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

● కొడవలూరు మండలానికి చెందిన నక్కబోతుల సురేంద్ర (23) గత ఏడాది ఫిబ్రవరిలో గుండెపోటుతో మృతిచెందారు.ఆ యువకుడికి గుండెపోటు వచ్చిన వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే ఆ యువకుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

● వెంకటాచలం మండలం చెముడుగుంటకు చెందిన సుధాకర్ (20) గత జూన్‌లో మృతిచెందాడు. గుండె పోటు వచ్చిన వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిగా, వారంపాటు చికిత్స పొంది మృతిచెందాడు. అయితే చికిత్స సమయంలో మరోసారి గుండెపోటు రావటంతో ఫలితం లేక పోయిందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

గుండె వ్యాధులు తస్మాత్ జాగ్రత్త



- యువకులకు సైతం గుండెపోటు...
- తాజాగా కేసుల సంఖ్య పెరుగుదల
- జిల్లాలో 2.50 లక్షలమంది హృదయ రోగులు
- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇలా ఎంతోమంది యువకులు గుండెపోటుకు గురికావటం జిల్లా వాసులను ఆందోళనకు గురి చేస్తుంది. ఇందుకు కారణం యువకులకు సరైన వ్యాయామం లేకపోవటం, ధూమపానం, మత్తుకు బానిసలుగా మారటమే. అర్ధరాత్రి సడన్‌గా గుండెపోటు రావటంతో నిద్రలోనే ప్రాణాలు పోతున్నాయి. గత ఆరేళ్లలో గుండెజబ్బుల నమోదు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో 60ఏళ్ల పైబడినవారిలో వచ్చే గుండెపోటు ప్రస్తుతం 17 ఏళ్ల వయసు వారికి వస్తున్నది. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సెప్టెంబరు 29న (నేడు) ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది. గుండెపోటుపై అవగాహన కల్పించి, ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరింది.

● ఆధునిక వైద్య విధానాలు

ప్రస్తుతం గుండెకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని నారాయణ, కిమ్స్, అపోలో, మెడికవర్, ఎయిమ్స్ ఆసుపత్రులలో అత్యంత ఆధునాతనమైన క్యాథ్‌ల్యాప్ పరికరం ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. సిటీయాంజీయో, టీఎంటీ వంటి పరికరాల ద్వారా గుండెజబ్బు ఏస్థాయిలో ఉందే గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. తాజాగా గుండె రక్తనాళాలకు వేసే స్టంట్‌లు కూడా కరిగి పోయే ఆధునిక చికిత్సలు అందుబాటులోకి రావటం శుభపరిణామం.

● లక్షలమంది వ్యాధిగ్రస్థులు

జిల్లాలో ప్రస్తుతం 2.50 లక్షలమంది గుండె వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతినెలా 500మందికిపైగా వ్యాధిగ్రస్థులు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. గుండెవ్యాధి బాధితులకు ప్రతి నెలా 150కిపైగా ప్రైమరీ యాంజియోప్లాస్టీ (స్టంట్స్) శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గుండెవ్యాధుల తీవ్రత కారణంగా గుండెకు బైపాస్ శస్త్రచికిత్సలు ప్రతినెలా జిల్లాలో 35 నుంచి 50 వరకు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

● ఏటా ఏడువేల మంది మృత్యువాత

జిల్లావ్యాప్తంగా ప్రతిఏటా ఏడువేల మంది గుండె వ్యాధులతో మృత్యువాత పడుతున్నారు. ఇందులో 40 ఏళ్ల లోపు బాధితులే ఎక్కువమంది ఉన్నారు. వీరిలో 25 ఏళ్ల లోపు వారు ఉన్నారంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో తెలుస్తుంది. ఏటా గుండెవ్యాధుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ధూమపానం వల్ల 56 శాతం గుండెజబ్బులు వస్తుండగా, గుండెపోటు వల్ల 25 శాతం, ఊబకాయంవల్ల ఐదు శాతం గుండెజబ్బుల గురవుతున్నారు. దారితీస్తోంది. ఆరోగ్యకరమైన వ్యక్తి కూడా ఏడాదికి ఒకసారి గుండె పరీక్షలు చేయించుకుంటే 80 శాతం గుండె జబ్బులను అధిగమించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గుండెపై తీవ్ర ప్రభావం

చిన్నారులపై గుండెపోటు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గతంలో 60 ఏళ్ల పైబడిన వారికి వచ్చే గుండె వ్యాధులు ప్రస్తుతం 5 నుంచి 17 ఏళ్ల వారిపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఆహారపు అలవాట్లు,



జీవన విధానాల వల్ల గుండె వ్యాధులు పెరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి కారణంగా కూడా అనేక మంది గుండె వ్యాధులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఆరునెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ భక్తవత్సలరెడ్డి,
అపోలో ఆసుపత్రి, గుండె వైద్య నిపుణులు

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు

గుండె వ్యాధులకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా వ్యాధి గ్రస్థులను కాపాడుతున్నాం. జిల్లాలో ప్రతినెలా 35 నుంచి 50 బైపాస్ శస్త్రచికిత్సలు జరుగు



తున్నాయి. గుండె వ్యాధిగ్రస్థులు 80 శాతం మందిని మృత్యువు నుంచి బయట పడేందుకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం. పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్‌కు అలవాటు పడటం, వ్యాయామం లేక పోవటం గుండెపోటుకు కారణంగా ఉన్నాయి.

- డాక్టర్ శ్రీనివాసరాజు,
కిమ్స్ ఆసుపత్రి, గుండె వైద్య నిపుణులు

ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి..

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌ను ఓ వ్యక్తి కత్తితో చంపుతానని బెదిరించి నగదు దోచుకెళ్లిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేట ఉప్పరపాలెంకు చెందిన బీ.గోపి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన ఈనెల 27వ తేది రాత్రి ఉప్పరపాలెం సెంటర్ వద్ద ఆటోను ఆపుకుని ఉండగా అదే ప్రాంతానికి చెందిన డీ సాయి రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేశా డు. గోపి లేవని చెప్పడంతో దాడి చేసి కత్తితో చంపుతానని బెదిరించి వెయ్యి నగదు దోచుకెళ్లాడు. ఈ విషయం బయట చెబితే చంపుతానని నిందితుడు బెదిరించాడు. ఈ మేరకు బాధిత ఆటో డ్రైవర్ ఆదివారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జీ దశరథ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌పీఎస్‌డబ్ల్యూ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ది ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఎఫ్‌పిఎస్‌డబ్ల్యు) ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదివారం నగరంలో ఆ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడుగా బండారు మాల్యాద్రి, జనరల్ సెక్రటరీగా పోకూరి మాల్యాద్రి, కోశాధికారిగా కుడుముల సంతోష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా దుగ్గిశెట్టి వెంకటసురేష్, జాయింట్ సెక్రటరీగా లక్కాకుల మాధవరావు ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గానికి ఎంపికైన సభ్యులు



గ్రావెల్ తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల సీజ్

కావలి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్రకోట నుండి ఎలాంటి అనుమతులు లేకుం డా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను ఆదివారం రూరల్ ఎస్‌ఐ బాజీబాబు సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. జాతీయ రహదారికి పడమట ఉన్న తిప్ప నుండి గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ బాజీబాబు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్ట ర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

● యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం, నాయకుడు జ్యోతిబసు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా మహాసభ జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత ఎన్నికల్లో టీడీపీ హామీ ఇచ్చిందని, దానిని నెరవేర్చాలని కోరారు. ఏళ్లు నిండిన వారిని అర్ధంతరంగా ఇంటికి పంపడం దుర్మార్గమన్నారు. 12వ పీఆర్‌సీ వెంటనే వేయాలని, సమ్మె కాలపు ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 35 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనర్సయ్య, నాయకులు కొండా ప్రసాద్, సుధాకర్, కృష్ణమూర్తి, కామాక్షమ్మ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సామ్రాజ్యం

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి


సూళ్లూరుపేట: చాముండేశ్వరి అలంకారంలో చెంగాలమ్మ


నాయుడుపేట: లలితా త్రిపురసుందరిదేవిగా మూకాంబికాదేవి


గూడూరు: ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి


వెంకటగిరి: మహాలక్ష్మి అలంకారంలో కాత్యాయనీదేవి

చండీ అలంకారంలో చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి చండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో యాగశాల మండపంలో మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి దేవస్థానం తరఫున సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ఆలయ సిబ్బంది సారె సమర్పించారు. నెల్లూరుకి చెందిన పందిళ్లపల్లి వెంకట శ్రీనాథ్‌రెడ్డి, నీరజ దంపతులు అలంకారం, చండీయాగానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు చాముండేశ్వరిగా, రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఓడూరు సురేష్‌రెడ్డి, మాధవిలత దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట: పట్టణంలోని గ్రామదేవత పోలేరమ్మ, మానసాదేవి, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ, దుర్గాదేవి ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూకాంబికాదేవిని లలిత త్రిపురసుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని విజయదుర్గాదేవి అలంకారంలో, బజారుకలశం వద్ద అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని సరస్వతీదేవిగా, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వనలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నవదుర్గ స్వరూపాలు ఆకట్టుకున్నాయి.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మను కాళికాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్ధరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని విజయలక్ష్మీదేవిగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరికి కంచి కామాక్షీ అలంకారం, మూలవిరాట్‌కు చాకెట్లతో, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్యాయనీదేవికి మహాలక్ష్మి అలంకారం, మందనాంచరేశ్వరిని వారాహిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: గ్రామదేవత కోటమ్మను చండీదేవిగా, గూడలిలోని రామలింగ చాముండేశ్వరిని మహాచండీ అలంకారంలో, కోటలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని గాయత్రిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి చిత్రపటాలు, గజమాలలతో గ్రామోత్సవం నిర్వహించారు.


చిల్లకూరు: కాళికాదేవి అలంకారంలో ముత్యాలమ్మ


కోట: చండీదేవి అలంకారంలో గ్రామదేవత కోటమ్మ

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి
ఇద్దరికి గాయాలు


మృతి చెందిన వెంకటచెందు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్ప రెడ్డిపాళెం రహదారి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పండ్లూరు గ్రామానికి చెందిన వెంకట చెందు, తిరుమల, కృష్ణ మోటారు సైకిల్‌పై ఆదివారం పట్టణంలో నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట చెందు(23) అక్కడికక్కడ మృతి చెందగా, తిరుమలకు తీవ్ర గాయాలు, కృష్ణ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గాయపడిన తిరుమల, కృష్ణలను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరుమల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పొనకా మల్లికార్జునరెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, రాధయ్య, రాము, కుమార్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

కోట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో నీలగిరి గిరిజన సంఘం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, కార్యదర్శి కోటేశ్వరరావు, రమేష్, రమణయ్య, పుట్టయ్య చేతుల మీదుగా మైక్‌సెట్ అందజేశారు.

ఆర్థిక సాయం

గూడూరు: మండలంలోని తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన మహిళ బేబి ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడింది. ఆమెకు వైద్య ఖర్చుల కోసం చెన్నూరు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు రూ.75వేలు అందించారు. కార్యక్రమంలో రవిచంద్రారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డి, ధనుంజయరెడ్డి, అల్లి రమేష్‌బాబు, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం

కోట: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పెళ్లకూరు మండలానికి చెందిన చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ గౌరీ శంకర్, సీఈవో సీతారామ నాయుడు, ఏవో కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.









